# ప్రయాణం

"వెధవ బతుకు. వట్టి బానిస బతుకు" అనుకుంటూ మేనేజర్ గుడారం నుంచి బయటకు వచ్చాడు అర్జునరావు.

అతని మనసు మండిపోతోంది. అతని ముఖం కోపంతో కందగడ్డలా అయింది. అర్జున్ తన గుడారం వైపు కదలబోతూంటే, మేనేజర్ బయటకు వచ్చి

"సారీ, అర్జున్. ట్రైటు అండర్ స్టేండ్ మి. కాసేపు విశ్రాంతి తీసుకో" అని మళ్ళీ తన గుడారంలోకి వెళ్ళిపోయాడు.

"మాటలకు మాత్రం లోటులేదు" అనుకుని, అర్జున్ అక్కడినుంచి మోటార్ సైకిల్ దగ్గరకు వెళ్ళాడు. స్టేండ్ వేసి వున్న మోటార్ సైకిల్ మీద కూర్చున్నాడు.

సర్కస్ డేరాలోంచి ఆర్కెస్ట్రా సంగీతం వినిపిస్తోంది. అప్పుడొస్తున్న మ్యూజిక్‌ను బట్టి ఏ ఫీట్ జరుగుతోందో తెలుసుకున్నాడు అర్జున్.

మున్సిపల్ స్టేడియం రంగురంగుల దీపాలతో మెరిసిపోతోంది. స్టేడియం ముందు ఆవరణ అంతా కోలాహలంగా వుంది. బుకింగ్ కౌంటర్స్ దగ్గర రెండో ఆట కోసం జనం బారులు తీరివున్నారు. ఫస్ట్‌షో అయితేనే కానీ కౌంటర్లు తెరవరు. సర్కస్ బావుందని నలుగురూ అనడంతో జనం టైమ్‌కు ముందే స్టేడియం చేరుకుంటున్నారు.

సర్కస్ డేరాకు వెనకనున్న ఖాళీస్థలంలో చిన్న చిన్న గుడారాలున్నాయి. ఓ మూల సింహం, పులుల బోనులున్నాయి. వాటికి దూరంగా గుర్రాలున్నాయి. గుర్రాల పక్కనే ఒంటెలున్నాయి. సర్కస్ డేరా వెనుక భాగం చిరుదీపాల వెలుగులతో మసకమసకగా వుంది.

"ఇంకో అరగంటలో తను మోటార్ సైకిలు స్టార్ట్‌చేసి, సర్కస్ డేరా లోపలికి వెళ్ళాలి. అక్కడి గ్లోబ్‌లోకి పోయి, తన ప్రదర్శన ఇవ్వాలి" గుర్తు చేసుకున్నాడు అర్జున్ కళ్ళు మూసుకుంటూ.

కళ్ళు మూసుకున్నా రామ్ కనిపిస్తున్నాడు. పదేళ్ళ రామ్ నవ్వుతూ, తుళ్ళుతూ

కనిపిస్తున్నాడు. వాడిది నవ్వు ముఖం. నవ్వు వచ్చిందంటే ఎంతలా నవ్వేస్తాడో. నవ్వేటప్పుడు వాడి కళ్ళు మూసుకుపోతాయి. కళ్ళల్లో నీళ్ళు తిరుగుతాయి.

కోడి రామ్మూర్తి అన్నా అతని బల ప్రదర్శనలన్నా అర్జున్‌కు ఎంతో పిచ్చి. అందుకే కొడుక్కి ఆ పేరు పెట్టాడు. తన కొడుకు కూడా గొప్ప బలశాలి కావాలని కొడుక్కి ఆ పేరు పెట్టాడు. తన తండ్రి పేరు కూడా రామ్మూర్తే. ఆయనకు సాహసాలన్నా, కుస్తీ పోటీలన్నా ఎంతో ఇష్టం. రామ్మూర్తిని ఆ వూరి వాళ్ళంతా 'భీముడు' అనే పిలిచేవాళ్ళు. తప్పితే "అపర కోడి రామ్మూర్తి రా" అనేవాళ్ళు. తన తండ్రి రామ్మూర్తి రెండెడ్ల బండికి కట్టిన తాడును పళ్ళతో నొక్కిపట్టి, సులువుగా బండిని లాగేసి అందర్నీ ఆశ్చర్యపరిచేవాడు. రోజూ తాలింఖానాకు వెళ్ళి వ్యాయామం చేసేవాడు. పాతిక కోడిగుడ్లు సునాయాసంగా తినేసేవాడు. ఓ కోడి మాంసం వుంటేనే కానీ ముద్ద దిగేది కాదు. ఆ విధంగా తినితిని, అర్జున్‌కు పదిహేనేళ్ళు వచ్చేటప్పటికి తండ్రి ఆస్తిఅంతా ఆఖరు చేసేశాడు.

అర్జున్ స్కూల్ ఫైనల్ చదువు మధ్యలో ఆగిపోయింది. అయినా, తండ్రి మీద గౌరవం తగ్గలేదు. తండ్రి సాహసప్రవృత్తి అర్జున్‌కు ఎంతో గొప్పగా వుండేది. అర్జున్ బతుకు తెరువుకోసం పల్లెటూరి నుంచి కాకినాడ వచ్చాడు. రకరకాల పనులు చేశాడు. అప్పుడు అక్కడ సర్కస్ ఆడుతోంది.

సర్కస్‌లో మోటార్ సైకిల్ ప్రదర్శన అర్జున్‌కు ఎంతగానో నచ్చింది. ఆ ప్రదర్శన కోసం అతను సర్కస్‌ను ఓ పదిపన్నెండు సార్లయినా చూశాడు. మోటార్ సైకిల్ ప్రదర్శన చేసే ప్రీతమ్‌సింగ్‌ను నెమ్మదిగా పరిచయం చేసుకున్నాడు. తనకూ మోటార్ సైకిల్ మీద ఆ ప్రదర్శన చేయాలని వుందనీ, నేర్పుతారా అనీ అర్జున్ భయం భయంగా అడిగాడు. అర్జున్‌లోని చురుకుదనం ప్రీతమ్‌సింగ్‌కు నచ్చింది.

"ముందు నా ప్రదర్శనను జాగ్రత్తగా గమనించు, కొన్నాళ్ళు పోయాక నీకు శిక్షణ ఇస్తాను" అని అర్జున్ భుజం తట్టాడతను.

అర్జున్ సర్కస్‌తో వూరూరూ తిరుగుతూ, మూడేళ్ళలో మోటార్ సైకిల్ విన్యాసం నేర్చుకున్నాడు. మొదట చెక్కలతో కట్టిన నూతిలో మోటార్ సైకిల్‌మీద తిరగడం, ఆ తర్వాత ఇనప వూచలతో తయారుచేసిన గ్లోబ్‌లో అతి వేగంగా తిరగడం నేర్చుకున్నాడు. కొంతకాలానికి జీప్‌మీద విన్యాసాలు చేయడం సొంతంగా ప్రాక్టీస్ చేశాడు. అందులో కూడా ప్రావీణ్యం సంపాదించి, ప్రదర్శనలు ఇవ్వడం మొదలు

పెట్టాడు. ఆ సర్కస్ కంపెనీ అగ్రిమెంట్ ముగిశాక, ఏడేళ్ళ క్రితం ఎక్కువ జీతం మీద ఈ సర్కస్ కంపెనీలో చేరాడు. ఒప్పందం ప్రకారం మరో ఎనిమిదేళ్ళవరకూ ఈ సర్కస్ కంపెనీలో వుండాలి.

ఏనుగుల విన్యాసాలు అయిపోయాయి. సర్కస్ డేరాలోంచి ఏనుగులు బయటకు వచ్చాయి. తన పక్కనుంచే నెమ్మదిగా వెళ్తున్న ఏనుగుల్ని చూసి అర్జున్ ఉలిక్కిపడ్డాడు. మరో పావుగంటలో తను ప్రదర్శన ఇవ్వాలి.

ఓ గంట క్రితం, అర్జున్ తనకు వచ్చిన టెలిగ్రామ్‌ను చూపించినా, మేనేజర్ ఏమాత్రం జాలిచూపించలేదు. ఓ వారం రోజుల సెలవు కావాలని అడిగితే లాభం లేదన్నాడు. పోనీ, ఇవేళ్టికి తన ప్రదర్శనను రద్దు చేయమని కోరాడు. దానికీ మేనేజర్ ఒప్పుకోలేదు.

"నువ్వు ఇవేళ ప్రదర్శన ఇవ్వక తప్పదు. నీ ప్రదర్శన గురించి పత్రికల్లో ఎంత ప్రచారం చేశామో చూశావుగా. మన సర్కస్‌ను ఇక్కడ ప్రారంభించి నాలుగు రోజులు కూడా కాలేదు. ఇప్పుడిప్పుడే జనం బాగా వస్తున్నారు. ప్రచారం చేసిన నీ ప్రదర్శన ఇవేళ లేకపోతే రేపు జనం బాగా తగ్గిపోతారు." అని మేనేజర్ ఎతో సౌమ్యంగానే చెప్పినా, ఆ మాటల్లో 'ఆజ్ఞ' వుంది.

అర్జున్ మోటార్ సైకిల్ దిగి, తన గుడారంలోకి వెళ్ళాడు. బట్టలు మార్చుకున్నాడు. విడిచిన చొక్కా జేబులోని టెలిగ్రామ్ కాగితం తీసి, దానివంక చూస్తూ కొద్ది క్షణాలు అలానే నిలుచుండిపోయాడు. ఆ కాగితాన్ని చొక్కా జేబులో పెట్టుకున్నాడు. విడిచిన పేంటు జేబులోని పర్సు తీసి, అందులోని ఫొటో వంక నీళ్ళు నిండిన కళ్ళతో చూశాడు. ఫొటోను ముద్దుపెట్టుకున్నాడు. ఫొటోలో రామ్ నవ్వుతూ నిలుచున్నాడు. అతని పక్కన తన భార్య సుశీల ప్రశాంతంగా చూస్తోంది. ఆమె కళ్ళు కాంతివంతంగా వున్నాయి.

రామ్ చాలా చురుకైనవాడు. ఒకరోజు కాలవగట్టుమీద తన చేతిని పట్టుకుని గబగబా నడుస్తున్నాడు. ఆ పెద్ద కాలువలో కొత్తనీరు ఎర్రగా వేగంగా ప్రవహిస్తోంది.

"నాన్నా, రెండ్రోజుల క్రితం కాలువలో నీరు లేదుకదా. వర్షం కూడా పడలేదు. ఇప్పుడింత నీరు ఎలా వచ్చేసింది?" అనడిగాడు రామ్.

"పొలాలు దమ్ము చేయడానికీ, ఆకుమళ్ళు వేయడానికీ ఇప్పుడు నీరు అవసరం. అందుకని ఆనకట్ట దగ్గర నిలవచేసిన నీటిని వదిలారు. దాంతో వర్షం పడకపోయినా

మన కాలవలోకి నీరు వచ్చేసింది."

"ఓహో, అదా సంగతి" అని రామ్ తండ్రి చెయ్యి వదిలి పరిగెట్టాడు.

"ఆగరా రామ్! నీకొక్క నిముషం కాలు నిలవదు. ఆగు, నేనూ వస్తున్నాను" అని అర్జున్ కూడా పరిగెట్టాడు.

తండ్రి పరుగు చూసి కొడుకు మరింత వేగంగా పరుగెడుతూ తూలి కాలవలో పడిపోయాడు. అర్జున్ గబుక్కున కాలవలోకి దూకి, రామ్‌ను పట్టుకుని, ఈత కొట్టుకుంటూ గట్టుమీదకొచ్చాడు. అప్పటికే రామ్ కొద్దిగా నీళ్ళు మింగేశాడు. ప్రాథమిక చికిత్స చేసి, అన్నాడు.

"ఏరా, బుడుగూ, నీకు ఈతరాదా"

"వస్తే నేనే పైకి వచ్చేవాణ్ణి కదా"

"అన్నీ పెద్ద కబుర్లు" అని అర్జున్ కొడుకును ముద్దుపెట్టుకున్నాడు.

మర్నాటినుంచి రామ్‌కు ఈత నేర్పాడు అర్జున్. వారం రోజుల్లో ఈతకొట్టడం వచ్చేసింది. మరో వారం రోజులకు బార ఈత, వెనకీత, నిలువీత, మునిగీత వచ్చేశాయి రామ్‌కు.

అర్జున్ తల విదిలించి, ఫొటోను మరోసారి ముద్దుపెట్టుకుని, పేంట్ జేబులో పెట్టుకుని గుడారంలోంచి మోటార్ సైకిల్ దగ్గరకొచ్చి, టైమ్ చూసుకున్నాడు. ఏనిమిదిన్నర. ఆర్కెస్ట్రా మ్యూజిక్ విన్నాడు. ఇంతలో లైట్లు ఆరిపోయాయి. ఆర్కెస్ట్రా "తుమ్ సే అచ్ఛా కౌన్ హై" పాట వినిపిస్తోంది. ఇప్పుడు తనదే ప్రదర్శన.

"నాన్నా, ఆ గ్లోబ్‌లో అంత స్పీడుగా మోటార్ సైకిల్‌మీద ఎలా తిరుగుతావు నాన్నా! కళ్ళు తిరిగిపోవూ?"

"అబ్బ! నీ ప్రదర్శన ఎంత బావుందో తెలుసా? అందరూ ఎంతసేపు చప్పట్లు కొట్టారో? నేనైతే మరీను. నువ్వెంత బాగా మోటార్ సైకిల నడిపితే, చప్పట్లు కొడుతూ అమ్మ ఏడ్చేసిందేవిటి నాన్నా" ఓ సంవత్సరం క్రితం తమ వూరికి దగ్గర్లో సర్కస్ వచ్చినప్పుడు తన ప్రదర్శన చూసి, అన్నాడు కొడుకు.

కొడుకు ప్రశంస తనకెంతో సంతోషం కలిగించింది. అన్ని సంవత్సరాలుగా ప్రేక్షకుల చప్పట్లు విని, పొందిన ఆనందం కంటే ఎక్కువ ఆనందం కలిగింది.

అర్జున్ మోటార్ సైకిల్ స్టార్ట్ చేశాడు. సర్కస్ డేరా వెనకద్వారం గుండా లోపలికెళ్ళాడు. చిరు వెలుగులో మోటార్ సైకిల్‌మీద 'రయ్'మని గ్లోబ్ దగ్గరికెళ్ళాడు.

విద్యుద్దీపాలు వెలిగాయి. పట్టపగల్లా ఉన్న దీపాల కాంతిలో ఓసారి ప్రేక్షకుల వంక చిర్నవ్వు నవ్వి, చెయ్యివూపి, మోటార్ సైకిల్‌ను గ్లోబ్‌లోకి పోనిచ్చాడు. సర్కస్ బోయ్ వెంటనే గ్లోబ్ తలుపు మూసేశాడు.

గ్లోబ్‌లో నెమ్మదిగా వేగం పెంచుతూ, అర్జున్ మోటార్ సైకిల్‌మీద తిరుగుతున్నాడు. సైలెన్సర్ తీసేసిన మోటార్ సైకిలు 'డబ్‌డబ్' శబ్దం వింటూ, గ్లోబ్‌లో వివిధ కోణాల్లో అత్యంత వేగంతో తిరుగుతున్న అర్జున్‌ను ప్రేక్షకులు ఊపిరి బిగపట్టి చూస్తున్నారు.

"నాన్నా. అంత స్పీడ్‌గా గ్లోబ్‌లో మోటార్ సైకిల్‌మీద ఎలా తిరుగుతావు నాన్నా! కళ్ళు తిరిగిపోవూ..."

"కళ్ళు తిరగవురా రామ్. అలవాటయిపోతుంది..." అర్జున్ కుడిచేయి హేండిల్ గ్రిప్‌ను మరింతగా తనవైపు తిప్పాడు. మోటార్ సైకిల్ విపరీతమైన వేగంతో తిరుగుతోంది. గ్లోబ్ ఊగిపోతోంది. గ్లోబ్ కదలికకు అర్జున్ ఈ లోకంలోకి వచ్చి, మోటార్ సైకిల్ స్పీడును కొంచెం తగ్గించాడు.

ఆర్కెస్ట్రా 'ఇన్‌హిలోగోంనే, ఇన్‌హిలోగోంనే' పాట ఎత్తుకుంది. అర్జున్ నెమ్మదిగా స్పీడు తగ్గించి, రెండు కాళ్ళూ గ్లోబ్ వూసల మీద అన్చాడు. సర్కస్ బోయ్ గబగబా వచ్చి, గ్లోబ్ తలుపు తీశాడు. అర్జున్ గ్లోబ్ లోంచి బయటకు వచ్చి ప్రేక్షకులకు అభివాదం చేశాడు. చప్పట్ల వర్షం పడింది. ఈలల గాలులు వీచాయి. అర్జున్ డేరా వెనక్కి పోయి, మోటార్ సైకిలు ఇంజన్ అపుచేసి, స్టేండ్ వేసి, దానిమీద కూర్చున్నాడు.

చప్పట్లు, చప్పట్లు. మనసులోని వెలితిని పూడ్చే చప్పట్లు.. తన నైపుణ్యాన్ని గుర్తించి, మెచ్చుకున్న చప్పట్లు... రేపు మీద ఆశలు వెదజల్లే చప్పట్లు.

రోజూ ప్రాణాలతో చెలగాటమాడుతూ, అనారోగ్యం కలిగినా, అప్పులు ఏమైపోయినా ఇలా ప్రదర్శనలు ఇవ్వాల్సిందే. డబ్బు, డబ్బు. ఈ డబ్బు కోసమే తను ఇన్నేళ్ళుగా రోజూ ప్రాణాలతో చెలగాటమాడుతున్నాడు. ఈ డబ్బు కోసమే పెళ్ళాం, పిల్లలకు దూరంగా బతుకుతున్నాడు. పెళ్ళికాక ముందు తన వృత్తి తనకెంతో గర్వంగా ఉండేది. తను తీసుకుంటున్న 'రిస్క్' గొప్ప సాహసంగా అనిపించేది. ఇప్పుడది రొటీన్!

సంవత్సరానికి ఓ నెల రోజులు మాత్రమే తమకు సెలవు. ఆ నెల రోజుల సెలవూ సర్కస్ కంపెనీ వాళ్ళందరికీ ఒక్కసారే ఇస్తారు. అప్పుడే తాము ఇళ్ళకు

వెళ్ళేది. పెళ్ళాం బిడ్డలతో ఓ నెల రోజులు గడపడం కోసం పదకొండు నెలలు వాళ్ళకు దూరంగా ఉండి, సెలవు కోసం ఎదురు చూస్తూ, ప్రాణాలకు తెగిస్తూ గడపాల్సిందే. తమకో వూరు లేదు. ఒక పట్నం నుంచి మరో పట్నానికి. ఒకోసారి ఒక దేశం నుంచి మరో దేశానికి... ప్రయాణాలు, ప్రయాణాలు. ఈ దుర్భర సంచార జీవనానికి స్వస్తి చెప్పేద్దామని తనకు తరచూ అనిపిస్తుంది. కానీ, సర్కస్ కంపెనీతో చేసుకున్న ఒప్పందాన్ని ఉల్లంఘించడం అసాధ్యం...

అయినా, తను ఈ ఉద్యోగం మానేస్తే, బతకడమెలాగ? తన చదువుకు ఇంత జీతం మరో ఉద్యోగంలో రాదు. ఏ కూలి పనో చేసుకుని బతకాలి. సుఖ పడిన తన శరీరం ఇప్పుడు ఆ పని చేయలేదు. అంచేతే, తను పెళ్ళాం, బిడ్డలకు దూరంగా... దగ్గరతనం, ఆత్మీయత అనుభవంలోకి వచ్చాక, ఆప్తులకు దూరంగా వుండడం చాలా కష్టం అన్న భావం మనసులో మెదలగానే, అర్జున్‌కు రీటా గుర్తుకొచ్చింది.

రీటా ఎంత అమాయకంగా, ఎంత అందంగా వుండేది.

ఉయ్యాల ఊగడంలో, సీసాల వరసలపై చెక్కలను చాలా ఎత్తు పేర్చాక, చివరి చెక్కపై నిలబడి రకరకాల విన్యాసాలు చేయడంలో రీటా అద్భుత నైపుణ్యం చూపేది. దీపాలకాంతిలో దేవతలా మెరిసిపోయేది. ప్రమాదకర విన్యాసాలు చేస్తూ, ప్రేక్షకులను చూసి హాయిగా నవ్వేది. ఆ నవ్వుకోసం మళ్ళీ మళ్ళీ సర్కస్‌కు వచ్చే యువకులూ వుండేవారు. గోపాల్ అలా రోజూ వచ్చి, ఆమెతో పరిచయం పెంచుకున్నాడు. అంతేకాదు, సర్కస్ కంపెనీ మరో నగరానికి మారిప్పుడు అక్కడకూ వచ్చేవాడు. ఏదో కంపెనీలో మంచి ఉద్యోగమూ, వెనక ఆస్తిపాస్తులూ వుండటంతో అతను హుషారుగా, ధైర్యంగా వుండేవాడు.

''గోపాల్, నేనూ ప్రేమించుకున్నాం. పెళ్ళి చేసుకుందామని నిర్ణయించుకున్నాం. అనుమతించండి'' అని రీటా మేనేజర్‌ను బతిమిలాడింది.

మేనేజర్ ఒప్పుకోలేదు.

''ఒప్పందం ప్రకారం మరో అయిదేళ్ళదాకా నువ్వు పెళ్ళి చేసుకోడానికి వీలు లేదు'' అని ఖరాఖండిగా చెప్పేశాడు.

ఆరోజున రీటా ఎంతగానో ఏడ్చింది. రెండో ఆట అయ్యాక పారిపోబోయి, పట్టుబడిపోయింది. మళ్ళీ ఎప్పుడూ ఇలాంటి పని చెయ్యబోకని మేనేజర్ రీటాను హెచ్చరించాడు. మర్నాటినుంచి రీటా నవ్వుతూ గలగలా తిరిగింది. ఉయ్యాలమీద

మెరుపులా మెరిసింది.

'గోపాల్‌ను మరిచిపోయినట్టుంది. మనసు పాడుచేసుకోవడంకంటే అదే మంచిది' అని తను అనుకున్నాడు.

అయితే, తన అంచనా తప్పని మరికొన్ని రోజులకు తెలిసింది. రీటా గుడారంలో కనిపించలేదు. చుట్టుపక్కల వెదికారు. ఊరంతా వెదికారు. రీటా కనిపించలేదు. ఆమెకోసం మేనేజర్ ఇప్పటికీ వెదికిస్తూనే వున్నాడు. రీటా గోపాల్ దగ్గరికే వెళ్ళిపోయి వుంటుందని అంతా అనుకున్నారు. తన ఇన్నేళ్ళ సర్కస్ జీవితంలోనూ విజయవంతంగా పారిపోయింది రీటా ఒక్కర్తే.

రీటా పారిపోయినప్పటినుంచీ తనకూ పారిపోవాలని అస్తమానం అనిపిస్తుంది. ఇవేళ అయితే మరీనూ. తను పారిపోయినా, సొంత ఇల్లు వున్న సొంత వూరికే వెళ్తాడు కాబట్టి, తనను సర్కస్ కంపెనీవాళ్ళు చాలా సులభంగా పట్టుకోగలరు. తర్వాత కంపెనీలో తన పరిస్థితి చాలా హీనంగా వుంటుంది. తమ ఒప్పందం ముగిశాక, రావలసిన డబ్బులోనూ కోత పడుతుంది.

"నాయనా రామ్! చూశావా తండ్రీ. ఇప్పుడు కూడా డబ్బులు లెక్క వేసుకుంటున్నాను".

అర్జున్‌కు ఇంతసేపూ ఆపుకున్న దుఃఖం ఇక ఆగలేదు.

అంతలో 'కమ్‌కమ్‌కమ్ కంగారు నీకేలనే' పాట గిటార్‌పై వినిపించింది. అర్జున్ కళ్ళు తుడుచుకుని, గబుక్కున మోటార్ సైకిల్ దిగి, జీపు దగ్గరకు పరిగెట్టాడు. జేబురుమాలుతో ముఖం తుడుచుకుని, జీపు ఎక్కి స్టార్ట్ చేశాడు.

సర్కస్ డేరా లోపలికి జీపును అత్యంత వేగంతో పోనిచ్చాడు అర్జున్. అంతవేగంగా వెళ్తే తప్ప, ఇటువైపు బల్లమీంచి అటువైపు బల్లమీదకు జీపు జంప్ చేయదు. జీప్ జంప్ చేయగానే ప్రేక్షకులు ఆశ్చర్యంతో, ఆనందంతో చప్పట్లు కొట్టారు. ఈలలు వేశారు. ఆర్కెస్ట్రా విచిత్ర ధ్వనులతో మారుమోగిపోయింది.

అటువైపు ఎత్తుగా వున్న బల్లమీదకు జీపు వెళ్ళగానే అర్జున్ బ్రేక్ వేశాడు. అయితే ఆగిపోవాల్సిన జీపు ఒక్కసారిగా ఎడమవైపుకి వంగింది.

"ఎక్కడో పొరబాటు జరిగిపోయింది" అనుకున్నాడు అర్జున్. జీపు ధనేలున బల్లమీంచి నేలమీదకు తిరగబడిపోయింది. ప్రేక్షకులు హాహాకారాలు చేస్తూ లేచి నిలబడ్డారు. జీపు చక్రాలు నిలబడాల్సిన బల్లకు అర్జున్ తల కొట్టుకుంది.

"నాయనా రామ్"

అర్జున్ పెదాలు ఇక కదలలేదు.

అర్జున్ చొక్కా జేబులోంచి బయటికొచ్చిన టెలిగ్రామ్ కాగితం రెపరెపలాడుతోంది. 'రామ్ చనిపోయాడు. వెంటనే బయల్దేరు" అని వుంది అందులో...

*(విపుల మాసపత్రిక, మార్చి 1987)*

(ధర్మయుగ్ - హిందీ వార పత్రిక 18-10-1987 -

అనువాదం : వై.సి.పి. వెంకటరెడ్డి)

- 'సంయుక్త కర్ణాటక' కన్నడ దినపత్రిక

ఆదివారం అనుబంధం 21-2-1988.

అనువాదం: శర్వాణి